క్లుప్తంగా

యర్రగొండపాలెం సీఐగా అజయ్‌కుమార్‌



యర్రగొండపాలెం: నియోజకవర్గ కేంద్రం యర్రగొండపాలెం సీఐగా కె.అజయ్‌కుమార్‌ శనివారం బాధ్యతలు చేపట్టారు. గుంటూరు రేంజి కార్యాలయంలో వీఆర్‌లో ఉన్న ఆయన్ను యర్రగొండపాలెం సర్కిల్‌ ఇన్‌స్పెక్టర్‌గా నియమిస్తూ ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు సీఐగా విధులు నిర్వర్తించిన సీహెచ్‌ ప్రభాకరరావును గుంటూరు రేంజ్‌ వీఆర్‌కు బదిలీ చేశారు. బాధ్యతలు చేపట్టిన అజయ్‌కుమార్‌ మాట్లాడుతూ సర్కిల్‌ పరిధిలో శాంతిభద్రతలు కాపాడేందుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

పుల్లలచెరువు: పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉండవచ్చని ఇన్‌చార్జి ఎంపీడీవో మరియదాసు అన్నారు. శనివారం మండల కార్యాలయాల వద్ద స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయాల వద్ద ర్యాలీ నిర్వహించి పరిసరాలు పరిశుభ్రత చేసి మొక్కలు నాటారు. మరియదాసు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, వాటిని పెంచడంలో పాటు ఇళ్ల వద్ద కూడా పరిశుభ్రంగా ఉంచుకోవడంతో ఆరోగ్యంగా ఉండొచ్చన్నారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా స్వచ్ఛ సేవ–స్వచ్ఛ ఆంధ్రపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డిప్యూటీ ఎంపీడీవో ఆత్మ, ఏపీవో మోషే పాల్గొన్నారు.

ఘనంగా ధన్వంతరి జయంతి



ధన్వంతరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయీబ్రాహ్మణులు

యర్రగొండపాలెం: నాయీబ్రాహ్మణుల కుల దైవం, తొలి ఆయుర్వేద వైద్యుడు ధన్వంతరి జయంతిని శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాయీబ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు దర్శిగుంట్ల సత్యనారాయణ, పెద్ద చెన్నయ్య, పాలూరి గురుమూర్తి, ముటుకూరి వెంకటేశ్వర్లు, గాజులపల్లి పెద్ద పాలంకయ్య, లింగాల చిన్న చెన్నయ్య, గుడిబండ్ల శ్రీనివాసరావు, పాలూరి వెంకటనారాయణ పాల్గొన్నారు.

వైఎస్సార్‌ సీపీ బలోపేతానికి కృషి చేయాలి

కురిచేడు: మండలం నుంచి వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ జిల్లా అనుబంధ విభాగాల్లో వివిధ కేటగిరీల్లో పదవులు పొందిన నాయకులు పార్టీ బలమైన శక్తిగా ఎదగటానికి శక్తి వంచన లేకుండా కృషి చేయాలని జెడ్పీటీసీ నుసుం వెంకటనాగిరెడ్డి కోరారు. జిల్లా కల్చరల్‌ వింగ్‌ ఉపాధ్యక్షుడిగా వరికూటి వెంకటేశ్వర్లు, జిల్లా మైనార్టీ సెల్‌ కార్యవర్గ సభ్యులుగా షేక్‌ మౌలాలీ, జిల్లా మహిళా విభాగం కార్యవర్గ సభ్యులుగా ఇందూరి పద్మా సుబ్బారెడ్డి, జిల్లా లీగల్‌ సెల్‌ కార్యవర్గ సభ్యులుగా పసుమర్తి వెంకట్రావు, జిల్లా ఆర్టీఐ వింగ్‌ కార్యదర్శిగా కంభంపాటి జోసెఫ్‌ ఎంపికయ్యారన్నారు. వీరిని ఎంపిక చేసిన పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్‌ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్‌ బూచేపల్లి వెంకాయమ్మలకు నాగిరెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయురాలికి పీహెచ్‌డీ ప్రదానం



అవార్డు అందుకుంటున్న సుభాషిణి

తాళ్లూరు: మండలంలోని బొద్దికూరపాడు హైస్కూల్‌ హిందీ ఉపాధ్యాయురాలు బద్రి సుభాషిణి పీహెచ్‌డీ పట్టా పొందారు. హిందీ సాహిత్యంలో సమకాలీన హిందీ కవి కేదార్నాథ్‌ అగర్వాల్‌ రచించిన కావ్యాల్లో జీవన విలువలు అనే అంశంపై ఆమె పరిశోధన చేశారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన గైడ్‌ ప్రొఫెసర్స్‌ రాజాశ్రీ మోర్‌ జీ, హెచ్‌ఓడీ మాయాదేవి చేతుల మీదగా గురువారం ఆమె అవార్డు అందుకున్నారు. పాఠశాల ఉపాధ్యాయులు సుభాషిణికి అభినందనలు తెలిపారు.

లైసెన్స్‌ ఒకటి.. దుకాణాలు మరిన్ని?

- నిబంధనలు పాటించని బాణసంచా విక్రయదారులు
- నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలంటున్న అధికారులు



బాణసంచా దుకాణాలు

పెద్దదోర్నాల:

దీపావళి అంటేనే బాంబుల మోత. ప్రతి ఇంటా దీపావళి టపాసులు కాల్చితేనే పండగ జరుపుకున్నట్లు లెక్క. గతంతో ప్రతి దుకాణంలో టపాకాయల విక్రయాలు జరిగేవి. కానీ కొందరు దుకాణాల నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోక పోవడంతో కొన్నిచోట్ల భారీ అగ్ని ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో బాణసంచా విక్రయాలపై కఠిన నిబంధనలు అమల్లోకి వచ్చాయి. దీపావళి పండగ వేళ టపాకాయలు విక్రయించేందుకు లైసెన్స్‌ తప్పనిసరితో పాటు జన సంచారం లేనిచోట దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలన్న నిబంధనలు ఉన్నాయి. దుకాణదారులు నిబంధనలు తుంగలో తొక్కుతున్నారనేది పలువురి ఆరోపణ.

ఒక లైసెన్స్‌తో ఒకే దుకాణం

దీపావళి బాణసంచా దుకాణాలకు ఒక లైసెన్స్‌ తీసుకుంటే ఒక దుకాణంలో మాత్రమే దీపావళి సామగ్రి అమ్ముకోవాల్సి ఉంటుంది. దీంతో పాటు లైసెన్స్‌ గడువు 15 రోజులు మాత్రమే ఉంటుంది. అయితే ఈ లైసెన్స్‌తో కొందరు వ్యాపారులు ఏడాది పాటు బాణసంచా విక్రయాలు చేపట్టడం ఆనవాయితీగా వస్తోంది. రెగ్యులర్‌ లైసెన్స్‌దారులకు మాత్రమే సంవత్సరం పొడువునా అమ్మకాలు చేసుకునే వెసులు బాటు ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. మండల కేంద్రంలో రెగ్యులర్‌ లైసెన్స్‌లు కలిగి ఉన్న వ్యాపారులు ఎవరన్నది ప్రశ్నార్థకమే. చాలామంది దుకాణాదారులు ఖాళీ ప్రదేశాల్లో కాకుండా జనావాస ప్రాంతాల్లో దుకాణాలు ఏర్పాటు చేసుకోవడంతో పాటు అధిక ధరలకు బాణసంచా విక్రయిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

అనుమతి లేకుంటే కఠిన చర్యలు



అనుమతులు లేకుండా బాణసంచా దుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవు. బాణసంచా అక్రమంగా నిల్వ ఉంచడం చట్టరీత్యా నేరం. బాణాసంచా విక్రయాలు నివాసాలకు దూరంగా నిర్దేశించిన స్థలాల్లోనే ఏర్పాటు చేసుకోవాలి.

– మహేష్‌, ఎస్సై, పెద్దదోర్నాల

పలు కుటుంబాలకు ఎమ్మెల్యే తాటిపర్తి పరామర్శ



పేరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి, ఇతర నాయకులు

త్రిపురాంతకం: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన, అనారోగ్యంతో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌ సీపీ కార్యకర్తల కుటుంబాలను యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌ పరామర్శించారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వారికి పూర్తిగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. మండలంలోని గణపవరానికి చెందిన యువకులు మేడపి వద్ద రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. వారిలో మందా పేరయ్య మృతి చెందాడు. ఆయన కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌ శనివారం పరామర్శించారు. అదే ప్రదాదంలో గాయపడిన మందా కోటేశ్‌ కుటుంబాన్ని కలిసి ఆయన ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. అన్ని విధాలా మద్దతుగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. అదే గ్రామంలో పార్టీ నాయకుడు నూనె శరభారెడ్డి ఇటీవల కంటి శస్త్ర చికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటుండగా ఆయన్ను కలిసి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. మిరియంపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌ సీపీ నాయకుడు ఎం.శ్యామ్‌ తండ్రి సుబ్బయ్య వైద్య చికిత్స తీసుకుని విశ్రాంతి తీసుకుంటుండగా ఆయన్ను కూడా ఎమ్మెల్యే పరామర్శించారు. పార్టీ పరంగా అన్ని రకాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యేతో పాటు పార్టీ కన్వీనర్‌ ఎస్‌.పోలిరెడ్డి, జెడ్పీటీసీ ఎం.జాన్‌పాల్‌, పార్టీ నాయకులు నరసింహారెడ్డి, ఎస్‌.రంగబాబు, ఆళ్ల కృష్ణారెడ్డి, జి.గురవయ్య, వెంకట నారాయణరెడ్డి, ఎం.గాలెయ్య, వెంకటేశ్వర్లు, వెంకటరెడ్డి, బాలకోటిరెడ్డి, అంకయ్య, సైదావలి, మీరావలి, సుబ్రహ్మణ్యం, మహిళా నాయకురాళ్లు సరళ, శారా ఉన్నారు.

కిడ్నీ దాతను కూడా..

యర్రగొండపాలెం: కిడ్నీ దానం చేసి తన మనుమరాలిని కాపాడుకున్న దాత, వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ నాయకుడు సయ్యద్‌ జబీవుల్లా తల్లిని ఎమ్మెల్యే, ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్‌ శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిడ్నీ దానం చేసి పలువురికి స్ఫూర్తిగా నిలిచిన ఆ తల్లిని అభినందించాలన్నారు. గుండెపోటుకు గురై స్థానిక ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌ సీపీ ఎస్సీ విభాగం జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి బొమ్మాజి బాలచెన్నయ్యను ఆయన పరామర్శించారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్‌ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, పంచాయతీ రాజ్‌ వింగ్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూమిరెడ్డి సుబ్బారెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్‌, జెడ్పీటీసీలు చేదూరి విజయభాస్కర్‌, వాగ్యానాయక్‌, పార్టీ మండల కన్వీనర్‌ ఏకుల ముసలారెడ్డి, వివిధ విభాగాల నాయకులు కె.ఓబులరెడ్డి, వై.వెంకటేశ్వరరెడ్డి, ఆర్‌.అరుణాబాయి, ఆవుల కోటిరెడ్డి, వై.రోషిరెడ్డి పాల్గొన్నారు.



కిడ్నీ దాతను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి



వైఎస్సార్‌ సీపీ నాయకుడు శరభారెడ్డిని పరామర్శిస్తూ..

గ్రామీణ సమస్యలు పట్టించుకోని ప్రభుత్వం

- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌



గణపవరంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి

త్రిపురాంతకం: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వానికి పట్టడం లేదని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌ విమర్శించారు. మండలంలోని గణపవరం, మిరియంపల్లి గ్రామాల్లో ఆయన శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు దారుణంగా ఉన్నాయన్నారు. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా తయారవ్వడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. కేవలం హామీలు ఇస్తే సరిపోదని, అవసరమైన నిధులు విడుదల చేయాల్సిన అవసరం ఉందన్నారు. లోపించిన పారిశుధ్యం కారణంగా ప్రజలు తరుచూ వ్యాధుల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వచ్ఛ ఆంధ్ర పేరుతో ప్రకటనలతో సరిపెడితే ప్రయోజనం ఏముంటుందని ప్రశ్నించారు. గ్రామాల్లో విద్యుత్‌ సరఫరాకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని, వీధి దీపాలకు సకాలంలో మరమ్మతులు చేయాలన్నారు.

సాగర్‌ చివరి భూములకు నీరందించాలి

నాగార్జున సాగర్‌ చివరి భూములకు సకాలంలో నీరంది పంటలు సాగు చేసుకునేందుకు సహకరించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే చంద్రశేఖర్‌ అభిప్రాయపడ్డారు. రైతులకు సక్రమంగా నీరందే విధంగా కృషి చేస్తానని రైతులకు హామీ ఇచ్చారు. సాగర్‌ కాలువల పరిధిలో ప్రతీ ఎకరాకు నీరందించే విధంగా చర్యలు తీసుకోవాలని చంద్రశేఖర్‌ పేర్కొన్నారు. ఈయన వెంట జెడ్పీటీసీ ఎం.జాన్‌పాల్‌, వైఎస్సార్‌ సీపీ మండల కన్వీనర్‌ ఎస్‌.పోలిరెడ్డి, పార్టీ నాయకులు రంగబాబు, కృష్ణారెడ్డి, గాలెయ్య, నక్కా చిన్న త్రిపురారెడ్డి, వెంకటేశ్వర్లు, కాశిరెడ్డి, సరళ ఉన్నారు.

తిరుమలనాథ స్వామికి భక్తుల ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకారంలో తిరుమలనాథస్వామి

పెద్దారవీడు: మండల పరిధిలోని చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి సమీపంలో వెలసిన శ్రీ రాజ్యలక్ష్మి సమేత గొడ్రాలికొండ తిరుమలనాథ స్వామికి శనివారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. దేవాలయం అర్చకులు భవానీప్రసాద్‌ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు అర్చనలు, అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించిన అనంతరం పట్టు వస్త్రాలు, అభరణాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి ఎదుట శ్రీచక్రం వద్ద దంపతులు కుంకుమార్చన చేశారు. సంతానం కలగాలని గిరికొండ చుట్టూ దంపతులు ప్రదక్షిణలు చేశారు. మహిళలు పొంగళ్ల తయారు చేసి స్వామికి నైవేద్యం చెల్లించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకొని కాయకర్పూరం సమర్పించి మొక్కుబడులు చెల్లించి తీర్థప్రసాదాలు అందుకున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి



మాట్లాడుతున్న ఎంఈవో ఇందిర

పుల్లలచెరువు: విద్యార్థులకు ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యనందించే విధంగా కృషి చేయాలని ఎంఈవో ఇందిర అన్నారు. శనివారం పీవీపల్లి కాంప్లెక్స్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ నూతనంగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థులకు రాయడం, చదవడం నేర్పించాలని, ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ప్రభుత్వ నియమాలు అనుసరించి సకాలంలో సిలబస్‌ పూర్తి చేయాలన్నారు. పదో తరగతి పరీక్షల్లో నూరుశాతం ఫలితాలు వచ్చే విధంగా ఉపాధ్యాయులు ఇప్పటి నుంచే ప్రత్యేక తర్ఫీదు ఇవ్వాలన్నారు. త్వరలో జరిగే ఎస్‌ఏ–1 పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలన్నారు. అకడమిక్‌ క్యాలెండర్‌ను తప్పనిసరిగా అనుసరించాలని, బోధనోపకరణాలతో బోధన చేయాలన్నారు. ప్రతి విద్యార్థికి అర్థమయ్యేలా సులభ పద్ధతిలో బోధించాలని చెప్పారు. విద్యార్థుల సామర్థ్యాల పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెడికల్‌ కళాశాలలను ప్రైవేటీకరించడం దారుణం

- వైఎస్సార్‌ సీపీ ఆధ్వర్యంలో నిరసన
- కోటి సంతకాల సేకరణ



నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌ సీపీ నాయకులు

త్రిపురాంతకం: మెడికల్‌ కళాశాలలను ప్రైవేటీకరించడం దారుణమని వైఎస్సార్‌ సీపీ నాయకులు విమర్శించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం వేగంగా జరుగుతోంది. మండలంలోని నడిగడ్డలో శనివారం జరిగిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో మెడికల్‌ కళాశాలలను ప్రైవేట్‌పరం చేయడం సరైన నిర్ణయం కాదని వైఎస్సార్‌ సీపీ నాయకులు, కార్యకర్తలు మండిపడ్డారు. రాష్ట్ర ప్రజల అవసరాలు, వైద్య రంగం అభివృద్ధికి, వైద్య విద్యలో విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని గత ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి మెడికల్‌ కళాశాలలు నిర్మించారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ప్రజల అవసరాలను గాలికి వదిలేసిందని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే ప్రైవేటు రంగం నుంచి వైద్య విద్య, వైద్య కళాశాలలకు విముక్తి కల్పించాలని డిమాండ్‌ చేశారు. ఎస్‌.రమణారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, సుబ్బయ్య సుబ్బారెడ్డి, ప్రముఖులు పాల్గొన్నారు.

ఎక్సైజ్‌ కార్యాలయంలో స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణ ఆంధ్ర



స్టేషన్‌ ఆవరణలో చెత్త తొలగిస్తున్న సీఐ, సిబ్బంది

దర్శి: జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతి నెలా 3వ శనివారం ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం చేపడుతున్నారు. శనివారం దర్శి ప్రొహిబిషన్‌ అండ్‌ ఎక్సైజ్‌ స్టేషన్‌లో స్వచ్ఛ ఆంధ్ర– స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. సీఐ కె.శ్రీనివాసరావు, ఎస్సైలు సిబ్బంది స్టేషన్‌లోని రికార్డులు, ఫర్నిచర్‌, పరిసరాలను శుభ్రం చేశారు. స్టేషన్‌ ఆవరణలోని చెత్తను వేరు చేసి ఒకచోట చేర్చి దహనం చేశారు. స్వర్ణ ఆంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర సాధనకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు.

శివరాజ్‌ నగర్‌లో..

శివరాజ్‌ నగర్‌ మండల పరిషత్‌ ప్రాథమిక పాఠశాలలో శనివారం పారిశుధ్య చర్యలు చేపట్టారు. తొలుత పాఠశాల అసెంబ్లీలో విద్యార్థులతో ప్రధానోపాధ్యాయుడు ధనిరెడ్డి వెంకటరెడ్డి స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీ చేశారు. ర్యాలీని మానవత సంస్థ చైర్మన్‌ దేవతి వరప్రసాద్‌ ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దర్శి మానవత సంస్థ అధ్యక్షుడు బసవయ్య, డైరెక్టర్‌ రోశరావు, ఉపాధ్యాయులు ఖాదర్‌ వలి, రామారావు, రోశయ్య, మరియమ్మ, సుజాత, బీబీజాన్‌, ఆదిలక్షమ్మ, సంధ్యారాణి పాల్గొన్నారు.

తాళ్లూరు: వృక్షాలను రక్షిస్తే అవి మనల్ని రక్షిస్తాయని ఎంపీడీవో అజిత, ఎంఈఓ సుబ్బయ్య అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్‌ కార్యాలయం ఆవరణలో స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చెట్లను నాటడానికి ఆశక్తి చూపాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ టి.శ్రీనివాసరావు, వైస్‌ ఎంపీపీ ఐ.వెంకటేశ్వర్‌రెడ్డి, జెడ్పీటీసీ మారం వెంకారెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో డి.నాగమల్లేశ్వరి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

బాణసంచా విక్రయదారులు నిబంధనలు పాటించాలి

దొనకొండ: అనుమతులు లేకుండా బాణసంచా విక్రయాలు జరిపితే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్‌ బి.రమాదేవి హెచ్చరించారు. శనివారం ఆమె బాణసంచా స్థలాలను పరిశీలించారు. దుకాణాలకు అనుమతి పొందిన వారు నీరు, ఇసుక సిద్ధం చేసుకోవాలన్నారు. అగ్నిమాపక శాఖ సూచించిన నిబంధనలు పాటించాలన్నారు. ఆది, సోమవారాలు రెండు రోజులు మాత్రమే బాణసంచా అమ్ముకోవాలన్నారు. ఈ రెండు రోజులు దాటిన తర్వాత ఎవరైనా అమ్మినట్లు తెలిస్తే కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్‌ హెచ్చరించారు.

ఎల్‌ఐసీ మహాసభను జయప్రదం చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎల్‌ఐసీ ఏఓఐ నాయకులు

దర్శి: ఎల్‌ఐసీ ఏఓఐ నెల్లూరు డివిజన్‌ ఆరో మహాసభను జయప్రదం చేయాలని డివిజన్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ బి.వెంకట్రావు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఎల్‌ఐసీ కార్యాలయం వద్ద ఎల్‌ఐసీ ఏఓఐ నెల్లూరు డివిజన్‌ ఆరో మహాసభ కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ ఏజెంట్ల సమస్యల కోసం నిరంతరం పోరాడుతున్న ఏకైక ట్రేడ్‌ యూనియన్‌ ఏఓఐ అని, రిజిస్ట్రేషన్‌ కలిగిన యూనియన్‌ ఏవోఐ మాత్రమేనని పేర్కొన్నారు. సేవ్‌ ఎల్‌ఐసీ– ప్రొటెక్ట్‌ ఏజెంట్స్‌ అనే నినాదంతో ఎల్‌ఐసీ సంస్థను కాపాడండి–ఏజెంట్లను రక్షించండి..అని ఏర్పడిన ఏకైక సంస్థ ఎల్‌ఐసీ ఏవోఐ అన్నారు. ఇప్పటికి పార్లమెంటు వద్ద ఆరుసార్లు ధర్నా చేసి పార్లమెంటు లోపల బయట ఎల్‌ఐసీ ఏజెంట్ల కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో నిరంతరం పోరాడుతోందన్నారు. పోరాటం చేసి జీఎస్టీని పూర్తిగా తీసివేసే విధంగా కృషి చేశామన్నారు. ఏజెంట్ల డిమాండ్ల కోసం ఈ నెల 19వ తేదీన కందుకూరు యూటీఎఫ్‌ భవన్‌లో జరిగే నెల్లూరు డివిజన్‌ ఆరో మహాసభలను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఆర్‌.రామకోటిరెడ్డి, బ్రాంచి కార్యదర్శి ఎస్కే కాలేబాషా, సీఐటీయూ డివిజన్‌ కార్యదర్శి తాండవ రంగారావు, సీనియర్‌ నాయకులు సందు వెంకటేశ్వరరావు, ఏజెంట్లు కేవీ పిచ్చయ్య, ప్రతాప్‌, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గడంతో తక్కువకే సూర్య ఘర్‌



పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న డీఈఈ శ్రీనివాసులు, ఇతర అధికారులు

దర్శి: కేంద్ర ప్రభుత్వం అందించే అభివృద్ధి ఫలాల్లో ఒకటైన సూపర్‌ జీఎస్టీ–సూపర్‌ సేవింగ్‌లో భాగంగా ఎలక్ట్రికల్‌ డిపార్ట్‌మెంట్‌ దర్శి డివిజన్‌ అధికారి పి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో శనివారం బహిరంగ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ దర్శి డివిజన్‌ కార్యాలయం నుంచి ప్రారంభమై డీఎస్పీ ఆఫీసు, పీజీఎస్‌ కాంప్లెక్స్‌, క్లాక్‌ టవర్‌ సెంటర్‌ మీదగా ఎంపీడీఓ ఆఫీసు వరకు సాగింది. అనంతరం జరిగిన అవగాహన సదస్సులో సూపర్‌ జీఎస్టీ–సూపర్‌ సేవింగ్‌తో విద్యుత్‌ వినియోగదారులకు అందించే రాయితీలు వివరించారు. పీఎం సూర్య ఘర్‌లో భాగంగా గృహాలపై సోలార్‌ ప్యానల్‌ అమర్చుకొనే వారికి జీఎస్టీని 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించినట్లు చెప్పారు. ర్యాలీలో జీఎస్టీ అధికారి సుధాకర్‌, మండల మేజిస్ట్రేట్‌ శ్రావణ్‌, మున్సిపల్‌ కమిషనర్‌ మహేశ్వరరావు, ఎంపీడీఓ కల్పన, మున్సిపల్‌ చైర్మన్‌ పిచ్చయ్య, వినియోగదారులు, సబ్‌ డివిజన్‌ పరిధిలోని దర్శి టౌన్‌, దర్శి రూరల్‌, ముండ్లమూరు, తాళ్లూరు, కురిచేడు మండలాల్లోని సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం



ప్రయాణికులతో మాట్లాడుతున్న డీఎం నరసింహులు

యర్రగొండపాలెం: ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితమని మార్కాపురం ఆర్టీసీ డిపో మేనేజర్‌ నరసింహులు అన్నారు. శనివారం ఆయన స్థానిక బస్టాండ్‌ను తనిఖీ చేసి ప్రయాణికులతో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాణాంతక ఆటోలు, ఇతర వాహనాలను ఆశ్రయించవద్దని, ఆర్టీసీ బస్సుల్లోనే సుఖంగా ప్రయాణించాలని, మహిళలు స్త్రీ శక్తి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి ప్రయాణికురాలు తమ ఆధార్‌ కార్డు తప్పనిసరిగా తెచ్చుకోవాలన్నారు. ప్రతి ఆదివారం పాకాల బీచ్‌కు ప్రత్యేంగా ఆర్టీసీ బస్సులు నడుపుతున్నామని, ఉదయం 8, 9 గంటలకు రెండు బస్సులు, అక్కడి నుంచి తిరిగి సాయంత్రం 3, 4 గంటలకు ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేశామని, ఆ బస్సుల్లో స్త్రీ శక్తి పథకం వర్తిస్తుందని పేర్కొన్నారు. కార్తీక మాసం సందర్భంగా అరుణాచలానికి ఆర్టీసీ సూపర్‌ లగ్జరీ బస్సు నడిపేందుకు సన్నాహాలు చేశామని, ఈ బస్సు ఈ నెల 25, నవంబర్‌ 3, 8, 15వ తేదీల్లో ప్రయాణికులకు అందుబాటులో ఉంటుందని, అరుణాచలం వెళ్లే భక్తులు ముందుగా రిజర్వేషన్లు చేసుకోవచ్చన్నారు. డీఎం వెంట అసిస్టెంట్‌ మేనేజర్‌ ధనలక్ష్మి ఉన్నారు.